క్లుప్తంగా

రేపు రైతు బజార్ వేలం

పెద్దేముల్: జూలై 1వ తేదీన పెద్దేముల్ రైతు బజార్, వాటర్ ఫిల్టర్‌తో పాటు దుకాణ సముదాయంలోని మడిగలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ప్రత్యేక అధికారి, మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, కార్యదర్శి చంద్రప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారి ఇంటి పన్ను, నల్లా బిల్లులు క్లియర్‌గా ఉండాలని సూచించారు. ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు పాట కొనసాగుతుందని, ఆసక్తి గలవారు రూ.15వేలు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు అదే రోజు పాట ప్రకారం మొత్తం డబ్బులు చెల్లించవలసి ఉంటుందని వెల్లడించారు.

తైబజార్ వేలం నిర్వహణ


వేలం నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: గ్రామంలోని సంత, వ్యాపార వస్తువులకు తైబందు వసూలుకు జీపీ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్ ఆధ్వర్యంలో శనివారం వేలం పాట నిర్వహించారు. ఇందులో 9నెలల కాలానికి పర్సపురం వెంకట్రాములు రూ.7లక్షల 11వేలకు హక్కులను పొందారు. గ్రామపంచాయతీ నిబంధనల మేరకు తైబందు వసూలు చేయాలని హక్కుదారుడికి అధికారులు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి


హంసన్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం

దుద్యాల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు చక్కగా పాఠాలను బోధించాలని జడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయరామా రావ్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధి హంసన్‌పల్లి, సాగారం తండా, చెట్టుపల్లితండా, చిలుముల మైల్వార్, నాజుఖాన్‌పల్లి గ్రామాల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల సమయపాలన, విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ రాందాస్ పాల్గొన్నారు.

కరుణించవా.. వరుణ దేవా

దేవతామూర్తులకు రైతుల జలాభిషేకం


హనుమాన్ ఆలయంలో భక్తులు

కొడంగల్ రూరల్: వానాకాలం సీజన్‌లో తొలకరి జల్లుల అనంతరం ముఖం చాటేసిన వరుణుడి కరుణ కోసం కర్షకులు ఎదురు చూస్తున్నారు. వర్షించకపోతాడా అంటూ ఆకాశం వైపు చేతులు జోడిస్తూ దీనంగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు, రైతులు వరుణదేవా కరుణించవా అంటూ దేవతామూర్తులను వేడుకుంటున్నారు. వడ్డర్‌గల్లి కాలనీ వాసులు కొందరు శనివారం కాలినడకన భజనలు చేసుకుంటూ పట్టణశివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి, తదితర ఆలయాలకు వెళ్లి దేవుళ్లకు జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.

కబ్జా చేస్తే కఠిన చర్యలు

మోమిన్‌పేట: ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ రాజు హెచ్చరించారు. మండల పరిధి ఏన్కతలలో సర్వే నంబరు 214లో 15గుంటల చిన్న చెరువు శిఖం భూమిని హైదరాబాదు వాసి కబ్జా చేశాడని గ్రామస్తుల ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు సర్వే చేపట్టి, జేసీబీతో ఆ భూమిని చెరువులో కలుపుతూ కాలువ తీయించామని ఆర్‌ఐ వెల్లడించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. శిఖం భూమిని కబ్జా చేయడమే కాకుండా.. సదరు వ్యక్తి తూము నుంచి నీళ్లు వెళ్లకుండా మట్టి పోశాడని, ఇది చెరువు కట్టకే ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మంత్రిపై ఆరోపణలు తగవు

దుద్యాల్: మంత్రి సీతక్కపై సామాజిక మాధ్యమాల వేదికగా బీఆర్‌ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేయడం తగదని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్ అన్నారు. శనివారం ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గిరిజన మహిళ అని చిన్న చూపు చూస్తూ.. సీతక్క మాజీ పీఏ ఇసుక దందా అంటూ చేస్తున్న విష ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

ఆనందంగా సర్కారు బడికి



ఆలేడ్ పాఠశాల


పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టీల్ వాటర్ ట్యాంకు

వసతుల కల్పనతో హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

దుద్యాల్: సర్కారు బడులు అంటేనే సమస్యలతో కొట్టుమిట్టాడుతాయనే అపోహతో.. తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలల్లో చదివించేందుకు మక్కువ చూపే తల్లిదండ్రులు.. క్రమంగా ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. కారణం సర్కారు సరస్వతీ నిలయాల్లో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులే. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మౌలిక సదుపాయాలను కల్పిస్తుండటంతో సర్కారు బడే ముద్దంటూ ముందుకు వస్తున్నారు.

సౌకర్యాల ఏర్పాటుతో తీరిన సమస్య

గతంలో వసతుల లేమితో అల్లాడుతున్న ఆలేడ్ పాఠశాల విద్యార్థుల లేక బోసిపోయేది. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఎంత నచ్చచెప్పినా.. ససేమిరా అనేవారు. ఈ నేపథ్యంలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.80 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో స్కూల్‌లో తాగునీటి సౌకర్యానికి అత్యాధునిక వాటర్ ట్యాంకు, మరుగుదొడ్ల మరమ్మతులు, కొత్తగా కుళాయిలు వంటివి ఏర్పాటు చేసింది. దీంతో గతంలో ఈ పాఠశాల వైపు చూడని గ్రామస్తులు.. పాఠశాల అభివృద్ధి, నాణ్యమైన విద్యాబోధనను చూసి వారి పిల్లలను పంపిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 51 ఉండగా.. ఉపాధ్యాయులు ఇద్దరు ఉన్నారు.

"చాలా ఇబ్బందిగా ఉండేది



చాలా కాలంగా ఆలేడ్ ప్రాథమిక పాఠశాలలో వసతులు లేక విద్యార్థినులు ఇబ్బంది పడేవారు. దీంతో తల్లిదండ్రులు బాలికలను పాఠశాలకు పంపేవారు కాదు. వసతుల ఏర్పాటు అనంతరం.. తల్లిదండ్రులకు నచ్చచెప్పి పిల్లలను బడికి పంపించేలా చేశాము. మరుగుదొడ్లను ఏర్పాటు చేసి ఇబ్బంది తొలగించాము. మరిన్ని వసుతుల ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

– సిద్దు మల్లేశ్, ప్రధానోపాధ్యాయుడు, ఆలేడ్ పాఠశాల

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఈశ్వరప్ప

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంచుకోవాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. శనివారం మండల పరిధి ఘణపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న శివాలయానికి రూ.2లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే పరిరక్షించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని కోరారు. గోమాతను పూజించడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ గోవులను సంరక్షించడం బాధ్యతగా భావించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, వర్ల అంజనేయులు, రాఘవేందర్ గౌడ్, మైపాల్, గడుసు మైపాల్, హన్మంతు, వెంకట్రాములు, శ్రీను, విజయ్, వెంకటేశ్, మహేశ్, ఆంజనేయులు, రాములు, రాజశేఖర్, కొండ నర్సింలు, కృష్ణయ్య, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరాయి దేశానికి జై కొట్టడం సిగ్గుచేటు

- బీజేపీ శ్రేణుల మండిపాటు..
- ఒవైసీ దిష్టిబొమ్మ దహనం
- ఎంపీ అసదుద్దీన్‌పై అనర్హత వేటుకు డిమాండ్


ఒవైసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కమలనాథులు

తాండూరు టౌన్: ఇక్కడే పుట్టి, ఇక్కడే ఉంటూ పరాయి దేశానికి జై కొట్టడం ఏంటని, బతుకునిచ్చిన దేశాన్ని నాశనం చేసే టెర్రరిస్టుల్లా అసదుద్దీన్ మాట్లాడటం సిగ్గు చేటని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఆ పార్టీ శ్రేణులు అంబేడ్కర్ చౌక్‌లో ఒవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అసదుద్దీన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడారు. పార్లమెంటులో ప్రమాణ స్వీకారం సందర్భంగా జై పాలస్తీనా అని నినదించిన ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పాత బస్తీని పాకిస్తాన్ టెర్రరిస్టులకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసి, అనర్హత వేటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాహు శ్రీలత, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ప్రధాన కార్యదర్శి కిరణ్ ముదిరాజ్, పూజారి పాండు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి


మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ డివిజన్ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికలాంగులకు పోలీసులు ఫ్రెండ్లీగా వ్యవహరిస్తారని, దివ్యాంగులను ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎన్‌పీఆర్‌డీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించే డివిజన్ స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌పీఆర్‌డీ మండల అధ్యక్షురాలు సావిత్రమ్మ, మండల ఉపాధ్యక్షుడు జి.అనిమేష్, కార్యదర్శి మారుతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ అబీబ్ అహ్మద్, పీడీ ప్రవీణ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల్కచర్లలో జూలై 1వ తేది, చౌడాపూర్‌లో 2న దరఖాస్తులను స్వీకరించి, అదే రోజు ఎంపిక ప్రక్రియ ముగించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు క్రీడల్లో ఉన్న ఆసక్తి, నైపుణ్యం తదితర అంశాలను పరిశీలిస్తామని, ఆసక్తి గల వారు బోనఫైడ్‌లతో రావాలని సూచించారు.

2న ఆలయ భూముల కౌలు వేలం

దోమ: మండల పరిధి దొంగ ఎన్కేపల్లి గ్రామం సంజీవ స్వామి దేవాలయ భూములను కౌలుకు వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి గూడూరు గ్రామ పరిధి సర్వే నంబర్ 66లో 14 ఎకరాలు, 135లో 10 ఎకరాల 32 గుంటలు, 173లో 20 ఎకరాల 17 గుంటలు, 174లో 0.38 గుంటల భూములు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూములకు జూలై 2వ తేదిన ఉదయం 11 గంటలకు సంజీవ ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తి గల రైతులు ముందుగా రూ.10 వేల ధరావత్ చెల్లించి, పాటలో పాల్గొనాలని సూచించారు. హక్కులు దక్కించుకున్న రైతుకు కౌలు పరిమితి రెండేళ్లు ఉంటుందని ఈఓ తెలిపారు.

ప్రతివారం ప్రజావాణి

మర్పల్లి: ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యా లయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్ మల్లయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మండల పరిధి ప్రజలు నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా.. తమ సమస్యలను లిఖిత పూర్వకంగా ప్రజావాణి కేంద్రంలో ఇస్తే.. సమస్యలకు సంబంధించిన అధికారులకు అర్జీని పంపుతామని పేర్కొన్నారు. అనంతరం పరిష్కారం లభిస్తుందన్నారు. సమస్య పరిష్కారం కాని ఎడలా.. ఎందుకు కాలేదనే వివరాలను తమ కార్యాలయం సిబ్బంది వివరించనున్నారని చెప్పారు. ప్రజావాణిలో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు అధికారి హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఛైర్మన్‌గిరి 'హస్త'గతం


దస్తయ్యకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఛైర్మన్‌గా దస్తయ్య ఏకగ్రీవం

దోమ: పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఛైర్మన్‌గిరిని అధికార పార్టీ చేజిక్కించుకుంది. ఉత్కంఠగా సాగిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా దోమ గ్రామానికి చెందిన కుమ్మరి దస్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం కార్యాలయంలో అధికారులు దస్తయ్యకు నియామక పత్రం అందజేశారు.

బీఆర్‌ఎస్ డెరెక్టర్ మద్దతుతో..

సంఘంలో పది మంది డైరెక్టర్లు ఉండగా.. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఐదుగురు, కాంగ్రెస్ నుంచి మరో ఐదుగురు డైరెక్టర్లు అయ్యారు. అయితే ఛైర్మన్ ఎన్నికకు మెజార్టీ సభ్యులు అవసరం కాగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన డైరెక్టర్ వార్ల లలిత అధికార పార్టీకి మద్దతు తెలిపింది. దీంతో ఛైర్మన్ గిరి హస్తగతమయింది. ఇదిలా ఉండగా.. ఛైర్మన్ దస్తయ్యను డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు దుద్యాల మల్లేశ్, బోయిని యాదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివకుమార్‌రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సవరణ లేక.. అర్హత పొందక

- గృహజ్యోతి, గృహలక్ష్మి కోసం అర్హుల ఆరాటం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు


ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలు(ఫైల్)

దౌల్తాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం అర్హులు ఎందురు చూస్తున్నారు. ముఖ్యంగా జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ రాయితీ పొందేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండల పరిధి ప్రజల నుంచి ప్రభుత్వం 11,658 దరఖాస్తులను స్వీకరించింది. అయితే సరైన ఆధారాలు లేవన్న కారణంతో చాలా అర్జీలను తిరస్కరించింది. దీంతో ఏమైందో తెలియక ప్రజలు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అర్హులైన తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎడిట్ ఆప్షన్ నిల్

ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తులను మాత్రమే ఈ–ప్రజాపాలన సేవా కేంద్రాల్లో చూడగలుగుతున్నారు. ఆధార్ లేదా రేషన్‌కార్డు నంబర్‌తో ఓపెన్ చేసి చూసేందుకు ఇది వీలవుతుంది. కానీ దరఖాస్తు దారుడు సమర్పించిన ఆధారాల్లో తప్పులు ఉంటే సరిదిద్దే అవకాశం(ఎడిట్ ఆప్షన్) ఇవ్వలేదు. గృహలక్ష్మి లబ్ధికి గ్యాస్ నంబరు నమోదు చేసిన వారికి రాయితీ నగదు రావడం లేదు. ఐడీ సరిపోలేదంటూ రిమార్కు చూపుతుంది. ఇది ఇటు అధికారులు అటు గ్యాస్ ఏజెన్సీ వారికి అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. గృహజ్యోతి విషయంలోనూ దరఖాస్తు దారుడు ఇచ్చిన మీటరు నంబరు సరిపోవడంలేదని చూపుతోంది.

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం

రైతుసేవా సహకార సంఘం ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్: ప్రజాభీష్టం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకంపై విధి విధానాలను రూపొందిస్తుందని పెద్దేముల్ రైతుసేవా సహకార సంఘం ఛైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, తట్టెపల్లి ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్, తట్టెపల్లి రైతు వేదిక భవనంలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2018 జనవరిలో రైతులు తీసుకున్న పంట రుణాలకు రుణమాఫీ వర్తింపచేయాలని కోరారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని, ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమే తమ ధ్యేయమన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. ఐదు ఎకరాల నుంచి పదేకరాల వారికి రైతు భరోసా పథకం ఇస్తే చిన్న కారు సన్నకారు రైతులకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ ఉద్యోగులకు, ఐటీ కట్టేవారికి, వెంచర్లకు భరోసా వర్తింపచేయరాదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య, అసిస్టెంట్ రిజిస్టార్ అధికారి చంద్రయ్య, తాండూరు డివిజన్ వ్యవసాయ అధికారి రుద్రమూర్తి, ఏఓ నజీరొద్దీన్, తట్టెపల్లి పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ఆంజప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

తహసీల్దార్ గణేశ్


వేలం పాటలో తహసీల్దార్ తదితరులు

మర్పల్లి: పంచాయతీ నిబంధనల మేరకు వారాం తంపు, ఇతర రోజుల్లో వ్యాపారులు, వాహనదారుల నుంచి తైబజార్ హక్కుదారులు డబ్బులు వసూలు చేసుకోవాలని జీపీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ గణేశ్ సూచించారు. ఉల్లంఘిస్తే తైబజార్ లైసెన్స్‌ను రద్దు చేసేందుకు పంచాయతీకి అధికారం ఉందని ఆయన స్పష్టంచేశారు. శనివారం మర్పల్లి గ్రామ పంచాయతీ తైబజార్ వేలం పాట నిర్వహించగా.. 9 నెలల కాల పరిమితికి బోయిని రాజు రూ.4.55 లక్షలకు తైబజార్ దక్కించుకున్నారు. ఎంపీఓ సుశీల్ కుమార్, జీపీ కార్యదర్శి లక్ష్మీకాంత్, కోఆప్షన్ సభ్యుడు సోయెల్, మాజీ సర్పంచ్ పాండు నాయక్, మాజీ ఎంపీటీసీ శేఖర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

పెద్దేముల్: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఏఎస్‌ఐ బక్కన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఏఎస్‌ఐ బక్కన్న, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు జైపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన వాహనదారులు, ప్రజలకు పోలీస్ చట్టాలు, బ్యాంకు లావాదేవీల గురించి అవగాహన కల్పించారు. మద్యం సేవించి వహనాలు నడపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ఏపీకే పేరిట ఉన్న లింక్‌ను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతా వివరాలు, వాట్సప్ గ్రూప్‌లు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తాయని చెప్పారు. అలాంటి లింకులను ఓపెన్ చేయరాదన్నారు.

◆ వారి సేవలు మరువలేనివి



తాండూరు రూరల్: పంచాయతీరాజ్ విభాగంలో పని చేసిన డీఈఈలు గోపినాథ్, కరుణాకర్‌చారిల సేవలు మరువలేనివని వికారాబాద్, తాండూరు డివిజన్ల పీఆర్ ఈఈలు శ్రీరాములు, ఉమేష్‌కుమార్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన గోపీనాథ్, కరుణాకర్‌చారికి శనివారం ఘనంగా ఆయన వీడ్కోలు పలికారు.

◆ పార్టీలకు అతీతంగా అభివృద్ధి



పరిగి: పార్టీలకు అతీతంగా మండాలన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ హరిప్రియ అన్నారు. శనివారం పట్టణ కేంద్రం మండల పరిషత్ సమావేశపు హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామానికి నిధులు తెచ్చి, అభివృద్ధి చేశామని సభ్యులు పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని వెల్లడించారు. ఇందులో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

◆ సెంకడ్ గ్రేడ్ టీచర్లపై చిన్నచూపు

దోమ: సెంకడ్ గ్రేడ్ ఉపాధ్యాయులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు కల్పిస్తున్నప్పటికీ సెంకడ్ గ్రేడ్ టీచర్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆలోచించి వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

◆ అన్నదాత ఆనందం

ధారూరు: ధారూరు మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి అన్నదాతలు ఆనందం వ్యక్తంచేశారు. 17 రోజులుగా వరుణుడు దోబూచులాడటం, విత్తిన విత్తనాలు మొలకెత్తిక పోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు వరుణుడు వర్షించడంతో పంటలకు మేలు చేస్తుందని రైతులు పేర్కొన్నారు.

◆ ఆర్థిక సహాయం

ధారూరు: బీజేపీ నాగసమందర్ గ్రామ నాయకుడు నర్సింలు శనివారం మృతి చెందారు. దీంతో ఆ పార్టీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, ధారూరు పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రాజునాయక్, నాయకులు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

◆ బోరు వేయించిన స్పీకర్



ధారూరు: మైసమ్మ ఆలయం వద్ద శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం బోరు వేయించారు. మండల పరిధి అంపల్లి చౌరస్తాలో కొలువుదీరిన మైసమ్మకు నిత్య పూజలు జరుగుతుంటాయి. తాగునీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని ప్రజలు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు మాన్‌సింగ్, హరిచంద్ ఉన్నారు.

◆ సాయిచంద్‌కు ఘన నివాళి

కొడంగల్ రూరల్: తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ సాయిచంద్ మౌర్య ప్రథమ వర్ధంతిని శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు హన్మంతు, అన్నారం సాయిలు, జగన్, ఏసు, వెంకట్, శ్రీనివాస్ ఉన్నారు.

◆ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

దోమ: బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం ఆవిష్కరించనున్న అంబేడ్కర్ విగ్రహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు సాలెటి వెంకట్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

◆ దొడ్డి కొమురయ్య జీవితం ఆధారంగా..

అనంతగిరి: తెలంగాణ కోసం అమరుడైన దొడ్డి కొమురయ్య పోరాట పటిమను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఆయన జీవిత చరిత్ర ఆధారంగా సినిమా నిర్మిస్తున్నామని సినీ దర్శకుడు సేనాపతి అన్నారు. శనివారం వివేకవాణి విద్యాలయంలో చిత్ర నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం నటీనటులు, డ్యాన్సర్లు, గాయకులను ఎంపిక చేశారు. ఇందులో చిత్ర నిర్మాణ కమిటీ జిల్లా అధ్యక్షుడు గోపాల్, కో–కన్వీనర్ రామన్న, నిర్మాత నర్సింలు, కోకన్వీనర్ రాములు మాదిగ, నిర్మాణ కమిటీ ఛైర్మన్ వికారాబాద్ గోపాల్, నాయకులు భాస్కర్, పాఠశాల కరస్పాండెంట్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ మార్కెట్‌యార్డు స్థలం సర్వే

కొడంగల్ రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు అభివృద్ధికి మార్కెట్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డీఈ శ్రీనివాస్, ఏఈ రాములు ఆధ్వర్యంలో మార్కెట్ స్థలాన్ని శనివారం సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్కెట్ స్థలం ఎంత ఉంది, వినియోగించుకునేందుకు ఏమేరకు ఉపయోగపడుతుందనే విషయాన్ని పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. దుకాణ సముదాయం, కార్యాలయాలు, తదితర వాటిని నిర్మించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

◆ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయండి

కొడంగల్ రూరల్: మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ బి.విజయకుమార్ సూచించారు. శనివారం మండలంలోని సంఘాయిపల్లిలో గ్రామసభ నిర్వహించారు. మొక్కలు నాటేందుకు జీపీ సిబ్బందికి సలహాలు, సూచలు ఇచ్చారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు.

◆ వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్యం



దుద్యాల్: సీజనల్ వ్యాధుల కాలమని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏఎస్‌ఎం విజయలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఇందులో ఎంఎల్‌హెచ్‌పీ నర్సమ్మ, ఆశ కార్యకర్తలు వసంత, ప్రమీల, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.